




ఆంధ్రదేశంలోని అమ్మకు అమెరికా అమ్మాయి నెలకో ఉత్తరం

కల్పనా రెంటాల

## ప్రియమైన అమ్మకు!

అమెరికాకు వచ్చాక ఏమొచ్చినా రాకపోయినా, మగవాళ్ళకు వంట, ఆడాళ్ళకు డ్రైవింగ్ మాత్రం వస్తుంది, అంటుంటారమ్మా చాలా మంది. అయితే ఈ మాట తెలుగు వాళ్ళకు మినహాయింపేమో అనిపిస్తుంటుంది ఇక్కడ తెలుగు కమ్యూనిటీని దగ్గరగా చూసినప్పుడు.

ఎందుకంటే తెలుగు వాళ్ళు అమెరికాలో ఉన్నా, అంతరిక్షంలో ఉన్నా కొన్ని మౌలికమైన విషయాల్లో ముఖ్యంగా కుటుంబ వ్యవస్థకు సంబంధించి చాలామంది అణుమాత్రమైనా మారకుండా అలాగే ఉంటారు. అలాంటివాటిని చూసినప్పుడు అరె వీళ్ళు మన తెలుగు వాళ్ళే అని టక్కున గుర్తుపట్టే విధంగా ఉంటుంది వాళ్ళ ప్రవర్తన. తెలుగువాళ్ళ మీద తెలుగువాళ్ళే వేసుకునే జోకుల్లో హాస్యంతోపాటు నూటికి నూరుశాతం నిజాలు కూడా ఉన్నాయన్న సంగతి అందరూ ఒప్పుకోవాల్సిన సంగతేకదా. పార్టీల్లో, ఫంక్షన్లలో, గెట్టుగెదర్లో మనవాళ్ళ స్టైలే డిఫరెంట్. అమెరికన్ ఫంక్షన్లకు వెళ్ళినప్పుడు మన వాళ్ళ ప్రవర్తన చూసి మన ఫంక్షన్లలో ఎవరికీ ఏదీ పట్టదు. డ్రింకులు తాగి గ్లాసులు ఎక్కడంటే అక్కడ పడేస్తుంటారు. ఏదన్నా కిందపడి కనిపించినా మనకేల అన్నట్టు చూడనట్టు వెళ్ళిపోతుంటారు. అదే అమెరికన్ బాస్ ఇంట్లో పార్టీకి వెళ్ళినపుడు చూడాలి. కుర్చీకి కాలు తగిలినా సారీ మీద సారీలు చెప్పేస్తుంటారు.

మొన్నా మధ్య ఓ పార్టీకి వెళ్ళానమ్మా. ఆడవాళ్ళంతా కిచెన్లో, మగవాళ్ళంతా హాల్లో సెటిలయ్యారు. వంట సెక్షన్ ఆడవాళ్ళకు, మేధోచర్చలు మగవాళ్ళకు! నాకైతే చెడ్డచిరాకేసిందనుకోమ్మా. అలా ఎవరికి వాళ్ళు జెండర్ గ్రూపులు పెట్టుకోకుండా హాయిగా అందరూ హాల్లో కూర్చుని మాట్లాడుకోవచ్చుకదా. పైగా ఓ పెద్దమనిషి కార్డ్స్ ఆడుకుంటాం టీలు, పకోడీలు ఉన్నాయా అంటూ వంటింటి దగ్గరకొచ్చాడు. నా ఫ్రెండేమో, మేం కూడా కార్డ్స్ ఆడతాం, అనగానే ఆయన అబ్బే, మా భర్తల బ్యాచ్ విడిగా ఆడుకుంటామండీ అంటూ చల్లగా జారుకున్నాడు. అప్పుడు నా ఫ్రెండ్ ఒకమ్మాయి నన్నేమడిగిందో తెలుసా? మనం కూడా వాళ్ళతో కలిసి కూర్చుని మాట్లాడితే వాళ్ళు మనల్ని ఇండీసెంట్ అనుకుంటారా? అని. ఆడవాళ్ళు వంటింట్లో కూర్చుని మాట్లాడుకుంటే డీసెన్సీ, మగవాళ్ళతో కలిసి కూర్చుని మాట్లాడితే ఇన్డీసెన్సీనా? ఇదీ ఇక్కడి ఆడవాళ్ళకున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు. అంతే కాదు, ఆలూగోబీ ఎలా చేయాలో, అరిసెలు ఎలా వండాలి అనో కాకుండా ఆడవాళ్ళు కూడా పరిటాల రవి హత్య కేసు గురించో, మేడం సోనియాకు వై.ఎస్. చేస్తున్న దాస్యం గురించో మాట్లాడగలరని, మాట్లాడాలని అనుకుంటారని వాళ్ళ చిన్న బుర్రలకు తట్టదనుకుంటానమ్మా. చిన్న బుర్ర అంటే గుర్తొచ్చింది.

ఆడవాళ్ళ బుర్ర మగవాళ్ళ బుర్ర పరిమాణానికి సంబంధం లేదని సైంటిస్టులు నిరూపణతో సహా చెపుతున్నా ఆడవాళ్ళకు బుర్ర తక్కువని, కాబట్టే సైన్స్, లెక్కల్లాంటి రంగాల్లో ఆడవాళ్ళ అగ్రస్థానాలకు చేరుకోలేకపోతున్నారని హార్వర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు లాంటివాళ్ళు ఇంకా అవాకులు, చెవాకులు పేలుతూనే ఉన్నారనుకో.

మగవాళ్ళ సంగతి సరే. మన ఆడవాళ్ళేమైనా తక్కువ తిన్నారా? ఎంతసేపూ అవతల వాళ్ళ వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి 'ఓ, మీరు డైవోర్సీనా, మీ అమ్మాయి డేటింగ్ చేస్తోందా?' అంటూ నానా చెత్తప్రశ్నలు వేస్తుంటారు. అదే మనం ఎదురు తిరిగి వాళ్ళ జీతం గురించో, వాళ్ళ అమ్మాయి డేటింగ్ విషయమో మాట్లాడామనుకో వెంటనే దాటేస్తుంటారు. ఇలాంటివన్నీ చూసినప్పుడు మాత్రం మనమున్నది నూరణాల తెలుగువాళ్ళ మధ్యే కదా అని గుర్తువచ్చేస్తుంటుంది.

ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే అమెరికాలో ఉన్నా మనవాళ్ళు కొన్ని చిన్న విషయాల్లో మాత్రం అంత తొందరగా మారరు. ఎందుకంటే వాళ్ళకు తెలిసి అదే మన కల్చర్. మరి మన సంస్కృతిని మనం కాపాడుకోవటం అంటే ఇదే అనుకుంటానమ్మా.

ఉంటాను.

చిన్నీ.